క్లుప్తంగా

టీటీడీ బోర్డ్ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే



భూపాలపల్లి రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడుని బుధవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ హాల్‌లో ఎమ్మెల్యే సత్యనారాయణరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే సిఫారసు లేఖల ద్వారా స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులను అనుమతించాలని కోరారు.

29న విజయోత్సవ ర్యాలీ



రేగొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య తెలిపా రు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా ఈ నెల 29న మండల కేంద్రంలో నిర్వహించే విజయోత్సవ ర్యాలీలో అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, జిల్లా, మండల నాయకులు సంపత్‌రావు, పున్నం రవి, వీరబ్రహ్మం, కనకం రమేష్, రవిందర్, స్వామి, చంద్రమౌళి పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన



మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం డెటాల్ బానేగా స్వస్థ్ ఇండియా ప్రాజెక్టులో భాగంగా పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కుమారస్వామి చేతుల మీదుగా ఉచితంగా డెటాల్ బానేగా స్వస్థ్ ఇండియా ప్రాజెక్టు వారు అందిస్తున్న సబ్బులని విద్యార్థులకి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ప్రాజెక్టు మేనేజర్ శ్యామ్ లాల్ ఆరోగ్య సూత్రాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్, కరపత్రాల ఆవిష్కరణ

మొగుళ్లపల్లి: మాల మహానాడు సింహగర్జన సభను విజయవంతం చేయాలని మాల ఎన్‌ట్రపినర్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దర్శనాల సురేశ్ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో మాలమహానాడు జిల్లా సీనియర్ నాయకుడు దర్శనాల రమేశ్‌బాబు ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి సింహగర్జన సభ వాల్‌పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్ 1న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే మాల మహానాడు సింహగర్జన సభకు మాలలు, ఉపకుల నాయకులు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గూడెపు హరికృష్ణ, గిరిమల్ల మహేందర్, దర్శనాల రవీందర్, దర్శనాల చంద్రమౌళి, గుత్తికొండ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



టేకుమట్ల: మండలంలోని రామకిష్టాపూర్(టి) గ్రామానికి చెందిన దాసరి కొమురయ్య బుధవారం మృతి చెందాడు. దీంతో సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట ఓబీసీ నియోజకవర్గ చైర్మన్ ఒరగంటి శేఖర్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నాంపెల్లి వీరేశం, ఎడ్ల రమేష్, అడగాని రామారావు, చిరంజీవి, వంగ నరేష్, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



కాటారం: ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయిన సంఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. దేవేందర్ అనే వ్యక్తి ధన్వాడ సమీపంలోని కిష్టంపేట వద్ద ఓ ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్‌ను అదుపు తప్పి తన ద్విచక్ర వాహనంతో ఢీ కొట్టాడు. దీంతో దేవేందర్ కింద పడిపోవడంతో తలకు, ఇతర శరీర భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో చికిత్స నిమిత్తం 108 ద్వారా భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు.

బేలర్‌తో రైతులకు మేలు

- తక్కువ ఖర్చు.. ఎక్కువ ఉపయోగం
- పశుగ్రాసం సేకరణలో రైతన్నకు చేదోడుగా యంత్రం



గడ్డి కట్టలు కడుతున్న యంత్రం

రేగొండ: వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ రోజురోజుకూ పెరుగుతోంది. పశుపోషణకు గ్రాసాన్ని నిల్వ చేసేందుకు రైతులకు యంత్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. గడ్డి కట్టలు కట్టే యంత్రాలు అందుబాటులోకి రావడంతో కూలీల కొరతను అధిగమించి ఎక్కువ విస్తీర్ణంలో పశుగ్రాసాన్ని నిల్వ చేసుకుంటున్నారు. హార్వెస్టర్‌తో వరి కోసిన తర్వాత బేలర్‌ను ట్రాక్టర్‌కు బిగించి కట్టలు కడతారు. వరి గడ్డిని గుండ్రంగా చుట్టి కట్టలు కడుతోంది. ఇలా ఎకరం పొలంలో గడ్డికట్టలు కట్టడానికి గంట సమయం పడుతోంది. దాదాపు 40 నుంచి 50 కట్టలు వస్తాయి. ఒక్క కట్ట కట్టడానికి రూ.35 తీసుకుంటున్నారు. ఒక్క రోజులో పది ఎకరాల విస్తీర్ణంలో పశుగ్రాసాన్ని కట్టలు కడుతున్నారు. దీంతో రైతులకు సమయం కలిసి రావడంతో పాటు ఖర్చు సైతం గణనీయంగా తగ్గుతోంది. వీటితో పాటు ఒక్కసారిగా ట్రాక్టర్‌లో సుమారుగా ఐదెకరాల పశుగ్రాసాన్ని తరలించేందుకు వీలుగా ఉంటుంది. ఎండిన పశుగ్రాసాన్ని కేవలం ఎకరాకు ఒకే ట్రాక్టర్ ట్రిప్పులో నిల్వ చేసి తరలించేవారు. దీంతో ఖర్చు పెరగగా కొందరు రైతులు పశువులను కూడా అమ్ముకున్న దాఖాలాలు ఉన్నాయి. పశుగ్రాసం నిల్వ సామర్థ్యం పెరగడంతో తిరిగి రైతులు పశుసంపదను పెంచుకునే ఆలోచన చేస్తున్నారు. అయితే ప్రభుత్వం ఈ యంత్రాలకు సబ్సిడీపై అందిస్తే రైతులకు మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తాయని మండలంలోని పలువురు రైతులు కోరుతున్నారు.

ఖర్చులు తగ్గాయి..



గతంలో వరి గడ్డి ఒక చోటకి తేవడానికి, వాము చేయడానికి రోజుకు ఒక్కొక్క కూలీకి రూ.500 అయ్యేవి. బేలర్ యంత్రంతో నేడు కట్టలు కడితే కూలీల ఖర్చులు తగ్గాయి. దీనికి తోడు సమయం వృథా కావడం లేదు. గడ్డి సేకరణ సులువు అవుతుంది. కట్టలు కట్టడంతో గడ్డి ఎక్కువ కాలం పాడవకుండా ఉంటుంది.

- వన్నాల శివాజీ, కొత్తపల్లిగోరి

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

కాటారం: మండలంలోని నస్తూర్‌పల్లి గ్రామపంచాయతీని కేంద్ర బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. సెంట్రల్ సెక్షన్ ఆఫీసర్ల శిక్షణలో భాగంగా ఉపాధిహామీ పథకంలో చేపట్టిన వాటర్ హార్వెస్టింగ్ పాండ్, సెగ్రిగేషన్ షెడ్, వైకుంఠధామం, పల్లె పకృతివనం, నర్సరీలను పరిశీలించారు. వాటి నిర్వాహణపై ఆరా తీశారు. ఉపాధి కూలీలతో మాట్లాడి పని కల్పిస్తున్న విధానం, చేపడుతున్న పనులు, పని చేసే వేళలు, కూలీ చెల్లింపుల గూర్చి అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ సక్రమంగా అందుతుందా, ఇతర అంశాలపై శిక్షణ ఆఫీసర్లు ఆరా తీశారు. మండల స్థాయిలో గ్రామపంచాయతీల్లో పరిపాలన, పథకాల అమలు తీరు, చేపడుతున్న అభివృద్ధి పనులపై అవగాహన కోసం గ్రామపంచాయతీల్లో పర్యటిస్తున్నట్లు బృందం సభ్యులు తెలిపారు. బృందం సభ్యుల్లో సెక్షన్ అధికారులు అమిత్‌చౌదరి, అంకిత్‌గుప్త, కృష్ణటాప్పో, ప్రవీణ్‌తాయల్, అనూప్‌సింగ్, అరవింద్‌కుమార్ సింగ్‌తో పాటు ఎంపీడీఓ బాబు, ఎంపీఓ వీరస్వామి, ఏపీఓ వెంకన్న, పంచాయతీ కార్యదర్శి షగీర్ ఖాన్, ఈజీఎస్ టెక్నిక్ అసిస్టెంట్లు మనోజ్ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



టేకుమట్ల: భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ



మొగుళ్లపల్లి: పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ కుమారస్వామి

- ఎంఈఓ సుధాకర్

టేకుమట్ల: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల విద్యాధికారి సుధాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో ఆకస్మిక తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టిక, స్టాక్ రిజిస్టర్, మెనూ, కిచెన్, వాటర్, కూరగాయలు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శీతాకాలంలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక చూపించాలని సూచించారు. అలాగే పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించే ప్రత్యేక తరగతులను విధిగా నిర్వహిస్తూ ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీపీఎస్‌ను బుధవారం ఎంఈఓ కుమారస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పిలలతో కలసి భోజనం చేశారు. అనంతరం ఎంఆర్సీలో ప్రతీ బుధవారం జరిగే ఫిజియో థెరపీ క్యాంప్‌ని సందర్శించి పిల్లలు, వారి తల్లిదండ్రులు హాజరు అయ్యేవిధంగా చూడాలని తెలిపారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

- లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పూల్‌సింగ్‌నాయక్



కరపత్రం ఆవిష్కరిస్తున్న పూల్‌సింగ్, తదితరులు

కాటారం: గిరిజన శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగం చేస్తున్న వారిని వెంటనే క్రమబద్ధీకరించాలని తెలంగాణ లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆజ్మీర పూల్‌సింగ్‌నాయక్ డిమాండ్ చేశారు. కాటారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో చలో హైదరాబాద్ కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూల్‌సింగ్ మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న వారిని గత పాలకులు మోసం చేశారని ఆరోపించారు. గి ఈ కార్యక్రమంలో పార్ట్ టైం ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా రాజు, వేల్పుల సంపత్, దోమ రామకృష్ణ, మంథెన శ్రీనివాస్, కృష్ణమాచారి, సర్దార్‌సింగ్, స్వప్న, పద్మ, రజిత, రాజశేఖర్, యాకమ్మ, నాన్ టీచింగ్ స్టాఫ్ పెండ్యాల సత్యనారాయణ, అల్లం మల్లయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

భూపాలపల్లి అర్బన్: మహిళల చట్టాలపై విద్యార్థులు అవగహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని మహిళ సాధికారత జిల్లా ఇన్‌చార్జ్ మిషన్ కోఆర్డినేటర్ అనూష తెలిపారు. మండలంలోని గోర్లవీడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అవగహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ.. ఆడపిల్లలపై లైంగిక వేధింపులు ఎక్కువ అవుతున్నాయన్నారు. ఎవరిని నమ్మొద్దని, లైంగిక వేధింపులపై ఫోక్సో చట్టం, మహిళ హక్కులు, సేవలు లింగ నిర్ధారణ చట్టం, బాల్యవివాహాలను అరికట్టాలని, తెలిపారు. సోషల్ మిడియాపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి నారాయణరావు, సిబ్బంది సురేష్, సునీత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనితలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై చర్చించాలి

- సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య



సమావేశంలో మాట్లాడుతున్న గట్టయ్య

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలపై నేడు (గురువారం) జరిగే స్ట్రక్చర్ సమావేశంలో చర్చించాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య డిమాండ్ చేశారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారానికి గుర్తింపు కార్మిక సంఘం యాజమాన్యం ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా కార్మికుల పక్షాన నిలబడాలని కోరారు. కుమారస్వామి, రాజయ్య, జనార్దన్, శ్రీధర్, ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్, బాబు ఉన్నారు.

'బీసీ రిజర్వేషన్లపై మాట్లాడడం విడ్డూరం'

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్

మొగుళ్లపల్లి: బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడడం విడ్డూరంగా ఉందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను అన్యాయంగా తగ్గించింది కేసీఆర్ అని గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్లపై మాట్లాడే నైతికత కవితకు లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో చేసిన సమగ్ర కుటుంబ సర్వే రిపోర్టు ఏమైందని ప్రశ్నించారు. పదేండ్లయినా ఈ లెక్కలు బయట పెట్టకుండా మోసం చేసి, ఇప్పుడు కుల గణనపై మాట్లాడడం విడ్డూరంగా ఉందని తెలిపారు. బీఆర్ఎస్‌కు బీసీలపై చిత్తశుద్ధి ఉంటే ఆ పార్టీ ప్రెసిడెంట్ పదవి బీసీలకే ఇవ్వాలని కోరారు. అదే విధంగా బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తానని ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీలకు వస్తున్న చైతన్యాన్ని చూసి విచ్ఛిన్నం చేయడానికి బీసీ రిజర్వేషన్లపై ఎమ్మెల్సీ కవిత హడావిడి చేస్తున్నారన్నారు.

ధాన్యంలో కోత పెట్టొద్దు

భూపాలపల్లి రూరల్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కటింగ్ లేకుండా కొనుగోలు చేయాలని ఎన్‌హెచ్ఆర్‌సీ జిల్లా అధ్యక్షుడు దుండ్ర కుమార్ యాదవ్ ప్రభుత్వానికి బుధవారం ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కోతలు విధించొద్దని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్వింటాకు ఆరు నుంచి పది కిలోల వరకు కటింగ్ చేస్తూ మిల్లర్లు అధికారుల ఆదేశాలను తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు. ఈ విషయంలో కలెక్టర్లు, సివిల్ సప్లై అధికారులు ప్రత్యేక చొరవ చూపి రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సర్దుబాటు వీఆర్‌ఓలకు అన్యాయం చేయొద్దు

- వీఆర్ఓల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇనిగాల కృష్ణమూర్తి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: జీఓ 121 ద్వారా సర్దుబాటు అయిన వీఆర్ఓలను అన్యాయానికి గురి చేయవద్దని వీఆర్ఓల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇనిగాల కృష్ణమూర్తి కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ రాహుల్‌శర్మకు వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలోని వీఆర్వోలను ఇతర శాఖల్లో సర్దుబాటు చేసినట్లు తెలిపారు. గ్రూప్–4 ద్వారా నియమించబడే జూనియర్ అసిస్టెట్ పోస్టులకు వివిధ శాఖలలో ఉన్న వీఆర్ఓలను తీసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వైద్యారోగ్యశాఖ కమిషనర్ వీఆర్ఓలను తొలగించి గ్రూప్–4 అభ్యర్థులను నియమించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. దీనిపై ప్రభుత్వం దృష్టిసారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటస్వామి, చంద్రమోహన్, లక్ష్మినారాయణ, శ్రీనివాస్, రమేష్, రాజులు పాల్గొన్నారు.

పేదలకు సాయం చేయడం గొప్ప విషయం



తోపుడు బండ్లను పంపిణీ చేస్తున్న రఘునాథ్‌రెడ్డి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

- చాడ రఘునాథ్‌రెడ్డి

భూపాలపల్లి రూరల్: పేదలకు జీవనోపాధికి సాయం అందించడం చాలా గొప్ప విషయమని పరకాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చాడ రఘునాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి గ్రామంలో ×ది రే ఆఫ్ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రఘునాథ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. బండ్ల పంపిణీకి సహకారం అందించిన దాతలు రవీందర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, సంపత్, సురేందర్‌రెడ్డి, హారికలను అభినందించారు. పేదలకు మరింతా సేవా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నూకల నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ లకిడె కమల–వెంకన్న, గ్రామస్తులు రాజేశ్వరరావు, నరెడ్ల తిరుపతిరెడ్డి, గాదం సదానందం, చుక్క రమేష్, మెరుగు దేవేందర్, పైండ్ల శంకర్, రావుల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- వైద్యుడు రాకేశ్



మాట్లాడుతున్న డాక్టర్ రాకేశ్

చిట్యాల: సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఒడితల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు రాకేశ్ అన్నారు. బుధవారం మండలంలోని జూకల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య స్థితిగతులపై అవగాహన కల్పించారు. శీతాకాలంలో వచ్చే వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గిరగాని కృష్ణ, హెల్త్ ఎడ్యూకేటర్ రేష్మ, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు మమత, ఉమాదేవి, రంజిత్‌కుమార్, స్వరూప చారి, తదితరులు పాల్గొన్నారు.

మేడారం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం తనిఖీ

ఎస్ఎస్ తాడ్వాయి: మండల పరిధిలోని మేడారం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్కీం కింద సెలెక్ట్ అయింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ విపిన్ కుమార్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సందర్భంగా స్కీం కింద చేయాల్సిన పనులను పీహెచ్‌సీ వైద్యాధికారి రణధీర్, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి పలు విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధులు బీపీ, మధుమేహం పరీక్షల మూడవ దశను వందశాతం పూర్తి చేయాలన్నారు. నిర్ధారణ అయిన వారికి మందులను అందించాలని ఆశ కార్యకర్తలు, సిబ్బందికి సూచించారు. వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డెమో సంపత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పూర్ణ సంపత్‌రావు, డాక్టర్ శ్యామ్, జిల్లా క్వాలిటీ అక్సిడెంట్ మేనేజర్ శరత్ ఉన్నారు.

గుడుంబా విక్రయిస్తే చర్యలు



చిట్యాల: గుడుంబాను పట్టుకున్న ఎస్సై శ్రావణ్‌కుమార్



టేకుమట్ల: పట్టుకున్న గుడుంబాను చూపిస్తున్న ఎస్సై ప్రసాద్

- ఎస్సై శ్రావణ్‌కుమార్

చిట్యాల: గ్రామాల్లో గుడుంబా విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై శ్రావణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని గిద్దెముత్తరంతండాలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. అందులో భాగంగా 60 లీటర్ల గుడంబాను పట్టుకున్నారు. అలాగే 300 లీటర్ల పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గుడంబాను తయారు చేస్తున్న ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామంలో యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. గ్రామంలోకి ఎవరైనా అపరిచిత వ్యక్తులు కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఎస్సై ఎండీ.షాఖాన్, పోలీస్ సిబ్బంది లాల్‌సింగ్, లింగన్న, అస్లాంజానీ, నవీన్, నాగరాజు, సందీప్, కోమల, మమత, లావణ్య పాల్గొన్నారు.



రేగొండ: స్వాధీనం చేసుకున్న గుడుంబా

రేగొండ: మండలంలోని రామన్నగూడెంతండా, భీమ్‌నగర్‌తండా, పోచంపల్లి, దమ్మన్నపేటలోని పలు ఇళ్లపై ఎస్సై సందీప్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 30 లీటర్ల గుడుంబా, 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

టేకుమట్ల: మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న గుడుంబా స్థావరాలపై బుధవారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై గోగికారి ప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంతో పాటు మండలంలోని అంకుషాపూర్, దుబ్యాల గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు చేయగా మండల కేంద్రానికి చెందిన తుమ్మల నాగరాజు వద్ద ఐదు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గుడుంబాను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుడుంబా విక్రయిస్తున్న వారి వివరాలను గ్రామస్తులు పోలీసులకు తెలిపి గుడుంబా నిర్మూలనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ తలుల రమేష్, కానిస్టేబుల్ మహేందర్, టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ



ఏటూరునాగారం: మండలంలోని రొయ్యూర్ గ్రామానికి చెందిన రాజు, మండల కేంద్రానికి చెందిన మర్తుజా ఇటీవల అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. దీంతో వారు ఆర్థిక సాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రాజుకు రూ.60వేల చెక్కు, ముర్తుజాకు రూ.27500ల చెక్కు మంజూరైంది. కాగా, ఈ చెక్కులను బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు అందజేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఆయూబ్, గుడ్ల దేవేందర్, బాలరాజు, నర్సింహారావు, గౌస్ పాల్గొన్నారు.